క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగింపు

కొత్తపల్లి : పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పని చేసిన కార్యకర్తలను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో ఉంటూ ప్రతిపక్ష పార్టీల కోసం పనిచేస్తున్న ముగ్గురు కార్యకర్తలను అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నుంచి గొర్లోనీబాయి మాజీ సర్పంచ్, జి.కృష్ణయ్య, భూనీడు రామకృష్టారెడ్డి, కొత్తపల్లి మదుసూధన్ రెడ్డిని తొలగిస్తున్నట్లు తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థికి అభినందనలు

మరికల్ : జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పెద్దచింతకుంటకు చెందిన విద్యార్థిని రాధ ప్రథమ స్థాయిలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం ఉపాధ్యాయులు విద్యా ర్థిని రాధను అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మహేంద్రమ్మ, హెచ్‌ఎం గోవర్ధన్‌గౌడ్, సైన్స్ ఉపాధ్యాయుడు ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప స్వామి మహాపూజ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సరాఫ్ బజార్ శ్రీబసవేశ్వర స్వామి దేవాలయం వద్ద శుక్రవారం అయ్యప్ప స్వామి 33వ మహాపూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు భారం బావి శివాలయం నుంచి కలశం ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలని కోరారు.

వైభవోపేతంగా మహా పడిపూజ

మక్తల్: మండలంలోని జక్లేర్‌లో గురువారం రాత్రి అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కలశాల ఊరేగింపు చేశారు. పడిపూజలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బీకేఆర్ చైర్మన్ బాలక్రిష్టారెడ్డి, 300ల మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక


అమరచింత: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయడానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి శుక్రవారం అమరచింతకు వస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ తెలిపారు. యాసంగి సాగు కోసం చెరుకు ఆయకట్టు పరిధిలోని 360 ఎకరాలకు సాగునీటిని అందించనున్నట్లు వెల్లడించారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి పెద్ద చెరువుకు నీటిని విడుదల చేస్తుండటంతో చెరువు నీటితో కళకళలాడుతుందన్నారు. రైతుల ప్రయోజనం కోసం సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నీటి విడుదల కార్యక్రమంలో ఆయకట్టు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఐనాపూర్ రోడ్డు మరమ్మతు చేపట్టండి



కృష్ణా: మండలంలోని చేగుంట, ఐనాపూర్ గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో వేసిన మట్టి కాస్తా వర్షాలకు కొట్టుకపోవడంతో మట్టిలోని రాళ్లు పైకి తేలడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే ఈ రోడ్డుపై ఏర్పడ్డ గుంతల కారణంగా వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాలకులు స్పందించకుంటే గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనారోగ్యంతో ఆలయ పూజారి మృతి



వేణుగోపాల్‌శర్మ (ఫైల్)

మరికల్: మండల కేంద్రంలోని హనుమాన్ వాడ ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన పూజారి వేణుగోపాల్‌శర్మ (52) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. 30 ఏళ్ల నుంచి ఆలయ పూజారిగా ఉన్నారు. పూజారి మృతితో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమమే ఎజెండా

మక్తల్: బడుగు బహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఆరు గ్యారంటీలను అమలు చేసిందని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బాలక్రిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, గణేష్‌కుమార్, భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, శంశోద్దీన్, నూరోద్దిన్, రవికుమార్, కట్ట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మక్తల్‌లోని సంకల్ప సొసైటీలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీద విడుదల చేశారు. కార్యక్రమంలో సీఈఓ పురుషోత్తంగౌడ్, అధ్యక్షుడు నాజియా ఇస్మాయిల్, జూబేర్‌పాష, వేణుగౌడ్, భాస్కర్, గడ్డం రమేష్, శ్రీనివాసులుగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి పూజలు

పట్టణంలో యల్లమ్మకుంట వీధిలో నూతనంగా ఎల్లమ్మ దేవత ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పూజలు చేసి పనునలు ప్రారంభించారు.

అన్నపూర్ణదేవి నిలయంగా మారుస్తా

ఊట్కూర్: మండలం ఉపాధ్యాయ, ఉద్యోగులతో సరస్వతి మాత నిలయంగా ఉందని, ముఖ్యమంత్రి విడుదల చేసిన 69 జీఓతో ప్రతి ఎకరాకు సాగు నీరందించి మండలాన్ని అన్నపూర్ణ దేవి నిలయంగా మారుస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ఊట్కూర్‌లో అంబేడ్కర్ కళా భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 69 జీఓ ద్వారా మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని, ఈ నెల చివరి వరకు ముఖ్యమంత్రి మండలానికి వచ్చి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని, మూడు సార్లు ప్లాన్‌ను మార్చడం వలన పనులు చేపట్టడం ఆలస్యమైందని తెలిపారు. నియోజవర్గానికి 5 అంబులెన్స్ మంజూరు కాగా.. ఊట్కూర్ మండలానికి త్వరలో అంబులెన్స్ వస్తుందన్నారు. మండలంలో రూ. 72 కోట్లతో రైతు రుణమాఫీ చేశామని తెలిపారు. మండలంలోని పులిమామిడిలో త్వరలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండలంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. క్రీడామైదానం కోసం 5 ఎకరాల భూమి చూయిస్తే రూ. 2 కోట్లు నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. గురుకుల పాఠశాల, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం కోసం చెక్‌పోస్టు సమీపంలో ప్రభుత్వ భూములను గుర్తించాలని తహసీల్దార్ రవిని ఆదేశించారు. అంబేడ్కర్ కళాభవనం ప్రహరీ, ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ రవి, నాయకులు సూర్యప్రకాశ్‌రెడ్డి, భాస్కర్, ఎల్కోటి నారాయణరెడ్డి, లింగం, కొక్కు శంకర్, దుర్గం శ్రీనివాస్, కె.గోపాల్, యగ్నేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

తపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కోస్గి రూరల్: నూతన సంవత్సర– 2025 తపస్ క్యాలెండర్, డైరీని మండల విద్యా వనరుల కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ శంకర్‌నాయక్‌లు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, కోస్గి అధ్యక్షుడు వెంకట్రాములు, గుండుమాల్ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, అనంతయ్య పాల్గొన్నారు.



కోస్గిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జిల్లా కేంద్రంలో..

నారాయణపేట ఎడ్యుకేషన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ నూతన క్యాలెండర్‌ను తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహాలతో కలిసి డీఈఓ గోవిందరాజులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో దేశభక్తి భావాలు పెంచే విధంగా మహనీయుల చిత్రపటాలతో రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ మండల ఎంఈఓలు బాలాజీ, బాలక్రిష్ణప్ప, రామచంద్రచారి, క్రిష్టారెడ్డి, ఎంఈఓ విద్యాసాగర్, జిల్లా సైన్స్ ఫోరం నాయకులు భాను ప్రకాష్, కనకప్ప, యాదయ్య, తపస్ నాయకులు పాల్గొన్నారు.

కురవ సంఘం ఆధ్వర్యంలో..

మరికల్ : మండలంలోని ఎలిగండ్ల బీరప్ప స్వామి దేవాలయం ఆవరణలో గురువారం కురవ సంఘం ఆధ్వర్యంలో రూపాదించిన క్యాలెండర్‌ను సంఘం అధ్యక్షుడు లింగప్పగౌడ్ ఆవిష్కరించారు. అనంతరం సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాములు, వెంకటేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధన చేపట్టాలి

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన చేపట్టాలని డీఈఓ గోవిందరాజు ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివరాములు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

మక్తల్ : ఉపాధ్యాయుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాద్గిర్ జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఊట్కూరు: మండల కేంద్రంలో కుర్వల ఆరాధ్య దైవం అయిన వీరలింగేశ్వరిస్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేపట్టారు. వచ్చే నెలలో నిర్వహించనున్న వీరలింగేశ్వరస్వామి జాతర ఏర్పాట్ల గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పొలిమేరలో ఉన్న ఆలయం వరకు విద్యుత్ సదుపాయం కల్పించాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆనవాయితీగా గొంగడితో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, కుర్వ ఆశప్ప, కుర్వ గోవిందప్ప, రామప్ప. తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్యుడు భాస్కర్‌గౌడ్ మొత్తం 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి పాలమూర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. ఇందులో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచందర్‌యాదవ్, ప్రతినిధులు వెన్న శేఖర్, కొటాల్ శంకర్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ప్రధాని మోదీ

నారాయణపేట రూరల్ : రైతు జీవితాలను పండుగ చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ రైతు పక్షపాతిగా నిలిచారని బీజేపీ నాయకులు రఘువీర్ యాదవ్, సిద్ధి వెంకట్ రాములు, వెంకటయ్య అన్నారు. గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేబినెట్ సమావేశంలో రైతులకు అండగా తీసుకున్న నిర్ణయాలు హర్షించదగ్గవన్నారు. రెండు పంటలకు బీమా పథకం పొడిగింపు, రైతు సంక్షేమం కోసం రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించడం హర్షణీయమన్నారు. పసల్ బీమా యోజనతో పాటు వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రకటించిందన్నారు. రూ.824.77 కోట్ల కార్పస్ ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వానికి రైతులపై ఉన్న ఆసక్తికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని వెంకటగిరి క్షేత్రం నందు వెలిసిన భూలక్ష్మి వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. కల్యాణోత్సవానికి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భూలక్ష్మి వేంకటేశ్వరస్వామి దంపతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. కల్యాణోత్సవానికి తిలికించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం గోవింద నామస్మరణంతో మార్మోగింది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామస్మరణంతో ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరా ఆచార్యులు, ఆలయ నిర్వాహకులు, గొల్ల బాబు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు శెట్టి, వెంకటేష్, శేఖర్ రెడ్డి, బాల్‌రెడ్డి, కోట్ల జగన్, వెంకటేశ్వర్‌రెడ్డి, పాలెం రాంబాబురెడ్డి, సంబరి భాస్కర్, రాజు, జ్యోతి, ఇంద్రదేవి, అనిత, సునీత తదితరులు ఉన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

డీపీఆర్‌ఓ కార్యాలయంలో వేడుకలు



నారాయణపేట : జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ (డీపీఆర్‌ఓ) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం అధికారులు, సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. కేక్‌ను డీపీఆర్‌ఓ ఎంఏ రషీద్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి

ఖిల్లాఘనపురం: రైతులు వరి సాగులో నేరుగా వెదజల్లే పద్ధతి అలవర్చుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని ఏఓ మల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని సోళీపురంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఓ రైతు పొలంలో వరి విత్తనాలను వెదజల్లే పద్ధతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోళీపురంలో ఇప్పటికే కొంతమంది రైతులు ఈ పద్ధతిని పాటిస్తున్నారని తెలిపారు. వరి పంటను ముందుగా నారుమడి పోసి తరువాత కరిగెట్లు చేసి నాటే పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. కూలీలు సకాలంలో దొరకక చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్న ఈ కాలంలో 12 గంటల పాటు నానబెట్టిన వరి విత్తనాలను నేరుగా దున్నిన పొలంలో వెదజల్లుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునిల్, రైతులు బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్‌నాయక్ తదితర రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు సాయిరెడ్డి, అహ్మద్‌ఖాన్, విజయ్‌బాబు, శ్రీనివాసులు ఆర్‌ఎంకు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌కు పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానంగా జిల్లాలో సింగిల్ క్రూ డ్యూటీలను సవరించాలని, అభ్యర్థన మేరకు బదిలీలు చేపట్టాలని, వెంటనే ఆర్టీసీ క్లినిక్‌లో మందులు సరఫరా చేయాలని ఆర్‌ఎంకు విన్నవించారు. ఆర్‌ఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



ఆర్‌ఎంకు పూలబొకె అందజేస్తున్న నాయకులు

ఉన్నత స్థాయిలో స్థిరపడితే సంతోషం

ధన్వాడ : విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడితేనే వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు సంతోషంగా ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి గాయత్రి అన్నారు. గురువారం మండలంలోని పాతపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రహరీ ప్రారంభం, నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలకలు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. అనంతరం పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి నరసింహాచారి, ఉపాధ్యాయులు ఫెరోస్, గీతరాణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ, గేట్‌ను ప్రారంభిస్తున్న మండల విద్యాశాఖ అధికారి గాయత్రి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మద్దూరు/కొత్తపల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని మండల అధికారులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంట గదులు, బియ్యం నిల్వలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలో స్థానిక తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎమ్మార్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, మద్దూరు ఎస్సీహస్టల్, బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీఓ రామన్న, కొత్తపల్లి మండలంలోని నందిగామ, తిమ్మారెడ్డిపల్లి, గోకుల్‌నగర్ పాఠశాలలో ఎంఈఓ ఆంజనేయులు తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి, లోదిపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. భోజన శాలలో బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం తాజా కూరగాయలతో ఆహారం వడ్డించాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌ఐ లింగారెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, రామాంజనేయులు ఉన్నారు.



కొత్తపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

బీటీ రోడ్లుగా మార్చాలని ఎంపీకి వినతి

నర్వ: మండలంలోని మట్టి రోడ్లను బీటీ రహదారులుగా మార్చాలని గురువారం పాలమూర్ ఎంపీ డీకే అరుణకు బీజేపీ మండల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి మండలంలోని ప్రధాన సమస్యలను ఎంపీకి వివరించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా గ్రామీణ రహదారులను బీటీ రహదారులుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నర్వ నుంచి లక్కర్‌దొడ్డి, పెద్దకడ్మూర్ నుంచి కొత్తపల్లి, లక్కర్‌దొడ్డి నుంచి కొత్తపల్లి వరకు బీటీ రోడ్లుగా మార్చాలన్నారు. వీటితో పాటు కొన్ని రోజులుగా పూర్తిగా దెబ్బతిన్న బీటీ రహదారులకు మరమ్మతు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నాగిరెడ్డిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆర్‌ఓ ప్లాంట్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకుల సమస్యలను సావధానంగా విన్న ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ మండల నాయకులు వావిళ్ల నరేందర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రాంపూర్ నర్సిములు, కృష్ణయ్య, బీసం రామకృష్ణ, డ్రైవర్ బుచ్చన్న, ఆంజనేయులు, రామంజనేయులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సమస్యల పరిష్కారానికి వినతి

నారాయణపేట రూరల్ : మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాలమూరు ఎంపీ డీకే అరుణను స్థానిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కెంచె శ్రీనివాసులు, మండల బీజేపీ అధ్యక్షుడు సాయిబన్న, మాజీ సర్పంచ్ రామకృష్ణలు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో రోడ్లు, డ్రైనేజీ, శేర్లపల్లిలో బీసీ భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కవులను ప్రోత్సహించాలని ఎంపీకి వినతి

మరికల్ : సమాజంలో జరుగుతున్న అంశాలపై కవిత్వం రూపంలో ప్రజలను ఉత్తేజపరుస్తున్న కవులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గుర్తించి ప్రోత్సహించాలని ప్రముఖ కవి బాలస్వామి అన్నారు. గురువారం ఎంపీ డీకే అరుణను మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో కలిసిన వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది కవులు, రచయితలకు సరైన గుర్తింపు లేదన్నారు. కార్యక్రమంలో ఉదయభాను, దామోందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు ఇవ్వాలి

అమరచింత: ప్రజాపాలన ద్వారా అర్హులందరికీ ప్రభుత్వపరంగా అందించాల్సిన ఆరు గ్యారంటీలను వర్తింపజేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని దరఖాస్తుదారులు ముట్టడించారు. ఈసందర్భంగా మాస్‌లైన్ పార్టీ నాయకులు ప్రసాద్, రాజన్న, సామేలు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానంలో భాగంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ పేదలకు అందటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వంద రోజుల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు నేటికీ జీరో కరెంటు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పడమే కానీ ఇంత వరకు సబ్సిడీ డబ్బులు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ చొరవ చూపి మరోమారు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ నురుల్‌నజీంకు అందించారు. కార్యక్రమంలో రాజు, కురుమన్న, ప్రేమరత్నం, మస్లమని, జిలాని పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

ఒత్తిడి జయిస్తే విజయం మనదే



మహమ్మదాబాద్: విద్యార్థులు పరీక్షల కోసం అనుక్షణం ఆలోచిస్తూ తీవ్రమైన మానసిక ఆందోళన చెందుతుంటారు. అలాంటి సమయంలో యోగా, ధ్యానం లాంటి ఆసనాల ద్వారా ఒత్తిడిని జయించవచ్చని హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రతినిధులు రాఘవేందర్, సురేష్‌లు తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియేట్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకునే నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతో బాటు సంతోషకరమైన జీవితానికి బాటలు వేసుకోవచ్చని తెలిపారు.

క్రీడాకారుడిని అభినందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



జడ్చర్ల టౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ 14 క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొని డబుల్ సెంచరీ 236 పరుగులు సాధించిన జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన జి. కేతన్‌ను గురువారం మాజీ మంత్రి హరీష్‌రావు అభినందించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేతన్ తండ్రి చర్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌లు మాజీ మంత్రి హరీష్‌రావును కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కేతన్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అభినందించారు. క్రీడా ప్రయాణంలో ఎల్లవేళలా సహ